సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024



బోట్లపై తీరం వైపు దూసుకొస్తున్న కమాండోలు



హెలికాప్టర్ నుంచి దిగుతున్న కమాండోలు

ఔరా..!



పారాచూట్ సాయంతో దిగుతున్న కమాండోలు



అబ్బురపరిచిన నేవీ రిహార్సల్స్ కిటకిటలాడిన ఆర్.కె.బీచ్

విశాఖ మరో అంతర్జాతీయ వేడుకకు సిద్ధమైంది. భారత నౌకాదళం సారథ్యంలో సోమవారం నుంచి ఈ నెల 27 వరకు జరగనున్న మిలాన్–24కు తూర్పు నావికాదళం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మిలాన్‌లో భాగంగా 22న జరగబోయే హార్బర్ ఫేజ్ విన్యాసాలకు సంబంధించి ఆదివారం ఆర్.కె.బీచ్‌లో నిర్వహించిన రిహార్సల్స్ అద్భుతంగా సాగాయి. యుద్ధ సమయంలో నావికాదళం ఎలా స్పందిస్తుంది? శత్రువులపై ఎలా ఎదురుదాడికి దిగుతుందో విన్యాసాల రూపంలో కళ్లకు కట్టినట్లు చూపించారు. తమ సత్తాను చాటుతూ.. నింగి, నేల, నీటిపై.. మన కమాండోలు చేసిన ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. గగనంలో యుద్ధ విమానాలు చక్కర్లు కొడుతూ బాంబులు వేయడం వంటి విన్యాసాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. నేవీ విద్యార్థులు జాతీయ, నేవీ గీతాలకు చేసిన నృత్య ప్రదర్శన, నేవీ సిబ్బంది బ్యాండ్ ప్రదర్శన, దేశ రక్షణ బలగాలతో కూడిన కవాతును చూసేందుకు పెద్ద ఎత్తున నగర ప్రజలు ఆర్.కె.బీచ్‌కు తరలివచ్చారు. సాయంత్రం సమయంలో సముద్రంలో యుద్ధ నౌకలు విద్యుత్ వెలుగులతో కనువిందు చేశాయి. సందర్శకులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక గ్యాలరీలు సిద్ధం చేశారు.

– బీచ్‌రోడ్డు



ఆకాశంలో విన్యాసాలు







నృత్య సాధన చేస్తున్న నేవీ విద్యార్థులు





మిలాన్ రిహార్సల్స్‌లో భాగంగా కవాతు చేస్తున్న రక్షణ బలగాలు



విన్యాసాలను తిలకిస్తున్న నగర ప్రజలు

న్యూస్‌రీల్

నేడు విశాఖ మ్యూజియం పునఃప్రారంభం

దాబాగార్డెన్స్: విశాఖ మ్యూజియం మళ్లీ అందుబాటులోకి రానుంది. దీన్ని సోమవారం పునఃప్రారంభించనున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సి.ఎం సాయికాంత్ వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. మిలాన్ 2024 సందర్భంగా మ్యూజియానికి మరమ్మతులు చేపట్టామన్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది జనవరి 29 నుంచి ఈ మ్యూజియంను మూసేసినట్లు పేర్కొన్నారు. దీని మరమ్మతులు పూర్తికావడంతో సందర్శకుల కోసం సోమవారం నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మ్యూజియంను సందర్శించవచ్చని సూచించారు.

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం పేరుతో సోమవారం స్పందన కార్యక్రమం జరగనుంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. పారిశుధ్య, పట్టణ ప్రణాళిక, మొక్కల విభాగాలతో పాటు రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు సంబంధించిన అర్జీలను ఈ స్పందనలో తెలియజేయవచ్చన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

సింథియా: మల్కాపురంలోని కేంద్రీయ విద్యాలయం–1లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఈనెల 29వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్ మైంగీ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాలతోపాటు ఆన్‌లైన్‌లో పూర్తి చేసిన దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు https://no1nausenabagh.kvs.ac.in వెబ్‌సైట్‌లో సందర్శించవచ్చన్నారు.

ఏయూలో వెబ్ సిరీస్ షూటింగ్



షూటింగ్‌లో పాల్గొన్న హీరో ఆది పినిశెట్టి

మద్దిలపాలెం: నటుడు ఆది పినిశెట్టి హీరోగా తెరకెక్కుతున్న ఓ వెబ్‌సిరీస్ షూటింగ్ ఆదివారం ఆంధ్ర విశ్వ విద్యాలయం ఇంజినీర్ కళాశాలలో జరిగింది. ఇక్కడ కాలేజీ ఎన్నికలు, ప్రచారం తదితర సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ విషయం తెలుసుకున్న సినీప్రియులు షూటింగ్ తిలకించేందుకు తరలివచ్చారు. ఏయూలో మరికొన్ని సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లు సమాచారం.

జంప్ జిలానీలకే పెద్దపీట!

- 'సుందరపు' ఫ్యామిలీకి పెరిగిన ప్రాధాన్యత
- గాజువాక సీటు తనకేనని చెప్పుకుంటున్న సతీష్
- అనకాపల్లి ఎంపీగా నాగబాబు పోటీ చేస్తారని లీకులు
- ఆయన కుమార్తె సినిమాకు సతీష్ పెట్టుబడి అంటూ ప్రచారం
- తమను దూరం పెట్టారంటూ పార్టీలో సీనియర్ల తీవ్ర అసహనం
- అసంతృప్తితో రగిలిపోతున్న జనసేన శ్రేణులు



సాక్షి, విశాఖపట్నం : ఇప్పటికే టీడీపీతో పొత్తుపై కత్తులు నూరుతున్న జనసేన శ్రేణులు ఇప్పుడు ఆ పార్టీలో అగ్ర నాయకుల వ్యవహార శైలిపై తీవ్ర అసహనంతో ఉన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేస్తున్న తమను కాదని నిన్నగాక మొన్న చేరిన జంప్ జిలానీలకు పెద్దపీట వేస్తున్నారంటూ రగిలిపోతున్నారు. కేవలం డబ్బుకే ప్రాధాన్యమిస్తున్నారు తప్ప పార్టీలో సేవలకు గుర్తింపు లేదంటూ ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో కొన్నాళ్ల క్రితం వరకు కొన్ని చోట్ల ఒకింత ఉత్సాహంగా కనిపించిన జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రస్తుత పరిణామాలతో నిర్లిప్తత, నైరాశ్యంతో కనిపిస్తున్నారు. ముఖ్యంగా ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో పాటు ఆయన సోదరుడు నాగబాబుల వైఖరిపై గుర్రుగా ఉన్నారు. పవన్ సామాజికవర్గానికి చెందిన యలమంచిలి నియోజకవర్గానికి చెందిన సుందరపు విజయ కుమార్ గతం నుంచే జనసేనలో ఉన్నారు. అప్పటికే జనసేన సానుభూతిపరుడిగా ఉన్న ఆయన సోదరుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి, పోర్టు కాంట్రాక్టరు సతీష్ పార్టీలో చేరుతున్నారంటూ ఆకస్మికంగా (డిసెంబర్ 7న) పవన్ కల్యాణ్‌తో విశాఖలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఇది జనసేన నేతలను సైతం ఆశ్చర్యానికి గురి చేసింది. ఆ తర్వాత నుంచి అదే సామాజికవర్గానికి చెందిన 'సుందరపు' కుటుంబానికి పవన్, నాగబాబులు అధిక ప్రాధాన్యమిస్తున్నారంటూ పార్టీలో చర్చ మొదలైంది. సతీష్ తాను నాగబాబుకు అత్యంత సన్నిహితునిగా చెప్పుకోవడం, అందుకు తగ్గట్టే నాగబాబు వ్యవహార శైలి ఉండడం పార్టీలో ఇతర నాయకులకు మింగుడు పడడం లేదు. టీడీపీతో పొత్తులో భాగంగా గాజువాక సీటు తమకు ఖరారైందని, ఆ స్థానం నుంచి సతీష్ పోటీ చేయబోతున్నారంటూ కొద్ది రోజుల నుంచి విస్తృత ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి నాగబాబు బరిలో ఉంటారన్న ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

నాగబాబు కుమార్తె సినిమాకు సతీష్ పెట్టుబడి

నాగబాబు కుమార్తె తీస్తున్న ఓ సినిమాకు సతీష్ భారీగా పెట్టుబడి పెట్టారని, అందుకే సతీష్ సోదరులిద్దరికీ పార్టీలో ప్రాధాన్యత నిస్తున్నారని, సతీష్‌కు గాజువాక సీటు దక్కేలా చూస్తున్నారని జనసేన నాయకులు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. పోర్టు కాంట్రాక్టరు కూడా అయిన సతీష్ గాజువాక సీటు నుంచి గెలిస్తే గంగవరం పోర్టుపై పట్టు సాధించవచ్చన్నది వారి వ్యూహంగా ఉందని పార్టీలో కొందరు చర్చించుకుంటున్నారు. ఒకవేళ అదే జరిగితే గాజువాక సీటుపై కోటి ఆశలు పెట్టుకున్న టీడీపీ నాయకుడు పల్లా శ్రీనివాసరావు పరిస్థితి ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది.

క్యాడరును పట్టించుకోని పవన్

అధినేత పవన్ విశాఖ వచ్చినప్పుడు తమను ఏమాత్రం పట్టించుకోవడం లేదంటూ జనసేన క్యాడరు అసంతృప్తితో ఉంది. ఎవరో ఒకరిద్దరికే కలిసే అవకాశం ఇవ్వడం, హోటల్ గదికే పరిమితమవ్వడం తప్ప మిగతా వారిని దరికి చేరనీయడం లేదని మథన పడుతున్నారు. ప్రజారాజ్యంలోనూ నాగబాబు ఇదే తీరును ప్రదర్శించారని, ఇప్పుడూ అదే జరుగుతోందని వీరు గుర్తు చేస్తున్నారు.

జీర్ణించుకోలేకపోతున్న సీనియర్లు..

మరోవైపు పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పని చేస్తున్న వారిని పక్కనబెట్టి పార్టీలు మారి వచ్చిన వారికి ప్రాధాన్యతనిస్తున్నారంటూ జనసేన సీనియర్లు రగిలిపోతున్నారు. ఇప్పటికే సుందరపు కుటుంబానికిస్తున్న ప్రాధాన్యతపై గుర్రుగా ఉన్న ఆ పార్టీ నాయకులు తాజా పరిణామాలతో మరింతగా అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణలు జనసేనలో చేరారు. వీరిలో పంచకర్లకు పెందుర్తి సీటు ఖాయమన్న ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో ఇన్నాళ్లూ ఆ సీటును ఆశిస్తున్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్‌కు మింగుడు పడడం లేదు. అలాగే మరో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్య కూడా విశాఖలో సీటు ఆశిస్తున్నారు. టీడీపీతో పొత్తులో ఆయనకు సీటు దక్కే అవకాశాలు లేకపోవడంతో కొన్నాళ్లుగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవలే జనసేనలో చేరిన కొణతాల రామకృష్ణ అనకాపల్లి అసెంబ్లీ నుంచి పోటీ చేస్తారన్న ప్రచారం అక్కడ చాలా ఏళ్లుగా ఇన్‌చార్జిగా ఉన్న పరచూరి భాస్కరరావుకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. టీడీపీతో పొత్తు వల్ల తమకు పోటీ చేసే అవకాశమే లేకుండా పోతోందన్న ఆవేదన ఒకవైపు, తాము కష్టపడి పార్టీ కోసం పనిచేస్తే ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పెద్ద పీట వేస్తున్నారన్న బాధ మరో వైపు జనసేన నాయకులను వేధిస్తోంది.

లోకేష్.. పిచ్చి ప్రేలాపనలు మానుకో..

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి హెచ్చరిక
- భీమిలిలో పోటీ చేయాలని సవాల్



సీతమ్మధార: భీమిలిలో నిర్వహించిన శంఖారావం సభ అట్టర్‌ఫ్లాప్ అయిందని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సీతమ్మధారలోని తన నివాసంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. శంఖారావం సభలో లోకేష్ తనపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును లోకేష్ చదువుతున్నాడని.. సంస్కారం లేకుండా మాట్లాడుతున్నాడన్నారు. తాను భీమిలిలో భూ కబ్జా చేసినట్లు లోకేష్ నిరూపిస్తే.. ఆ భూమిని అతనికే రాసిస్తానన్నారు. భూ కబ్జాలు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగాయి కాబట్టే.. ప్రజలు ఆ పార్టీ నాయకులను ఘోరంగా ఓడించారన్నారు. అది గ్రహించని లోకేష్ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడన్నారు. లోకేష్‌కు ధైర్యం ఉంటే భీమిలిలో పోటీ చేయాలని సవాల్ విసిరారు. పవన్‌కల్యాణ్‌ను ఎందుకు దగ్గరకు తీసుకున్నారో.. జూ.ఎన్టీఆర్‌ను ఎందుకు దూరం పెట్టారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. రాజ్యసభ సీట్లతో వ్యాపారం చేసింది చంద్రబాబు అని, ఓ దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి రాజ్యసభ సీటు ఇచ్చిన చరిత్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అని ముత్తంశెట్టి అన్నారు. లోకేష్ చేతిలో ఉన్నది ఎర్రబుక్ కాదని... అది ఎర్రిబుక్ అని ఎద్దేవా చేశారు. పవన్‌కల్యాణ్ ఆత్మాభిమానం లేకుండా వ్యవహరిస్తున్నారన్నారు. సీఎం పదవి ఇవ్వమని ఛీ పొమ్మన్నా..టీడీపీ వెంటే పవన్ పడుతున్నారన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఓట్లు కావాలి.. ఎమ్మెల్యే సీట్లు కావాలి... రాజధాని మాత్రం అమరావతి ఒక్కటే ఉండాలనడం సరికాదన్నారు. ఓ వర్గానికి, ఓ ప్రాంతానికి ప్రయోజనం చేకూర్చే విధంగా తెలుగుదేశం నాయకులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పార్టీలకు అతీతంగా.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న గొప్ప నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు.

నెలాఖరు నుంచి 'పికప్'!

- ఇకపై సొంతంగానే ఆర్టీసీ కార్గో డెలివరీ
- ఇప్పటికే విజయవాడలో ప్రారంభం
- విశాఖలో ప్రారంభించేందుకు సన్నాహాలు

సాక్షి, విశాఖపట్నం: ఆర్టీసీ కార్గో సేవలను మరింత సరళతరం చేస్తోంది. ప్రజలకు చేరువయ్యేలా చర్యలు చేపడుతోంది. గత అక్టోబరులో ఆర్టీసీ డోర్ డెలివరీ సదుపాయాన్ని ప్రారంభించింది. ఈ డోర్ డెలివరీలో భాగంగా పది కిలోమీటర్ల పరిధి వరకు సరకును బట్వాడా చేస్తోంది. డోర్ డెలివరీకి ఇతర ప్రైవేటు కార్గో సంస్థలకంటే తక్కువ చార్జీలనే వసూలు చేస్తుండడంతో విజయవంతంగా నడుస్తోంది. మరోవైపు షిప్‌మంత్ర అనే స్టార్టప్ సంస్థ ద్వారా ఆర్టీసీ కార్గో పికప్‌కు కూడా గతంలో శ్రీకారం చుట్టింది. దీనిని మరింత మెరుగ్గా విస్తృతం చేసే చర్యల్లో భాగంగా ఆర్టీసీ స్వీయ పర్యవేక్షణలో పికప్‌కు చేపట్టాలని నిర్ణయించింది. పైలట్ ప్రాజెక్టు కింద తొలుత విజయవాడలో జనవరి 11న ప్రారంభించింది. అనంతరం విశాఖపట్నం, తిరుపతి నగరాల్లోనూ అమలు చేయనున్నట్టు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ నెలాఖరుకల్లా విశాఖపట్నంలో కార్గో పికప్ చేపట్టడానికి ఆర్టీసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సింగ్ సొల్యూషన్స్ సంస్థ ద్వారా ఆర్టీసీ స్వయంగా డోర్ డెలివరీతో పాటు పికప్ సేవలను అందించనున్నారు. ఈ పికప్ సేవలు కోరుకునే వారు https://cargo.apsrtconline.in/ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే సిబ్బంది వచ్చి సరకు/పార్సిల్/ కొరియర్ (కార్గో)ను తీసుకెళ్తారు. అంతేకాదు.. డోర్ డెలివరీ కూడా చేస్తారు. ఇలా పది కిలోమీటర్ల పరిధిలో 50 కిలోల వరకు కార్గోను పికప్, డోర్ డెలివరీ సదుపాయాన్ని కల్పించారు. ఇందుకు ఒక్కో పార్సిల్‌కు రూ.20 చొప్పున అదనంగా చెల్లిస్తే సరిపోతుంది. ఇది ఇతర ప్రైవేటు సంస్థలు వసూలు చేసే చార్జీకంటే తక్కువగా ఉంటోంది. అందువల్ల విశాఖలో ప్రారంభించబోయే పికప్ సదుపాయానికి ప్రజల నుంచి మంచి ఆదరణ ఉంటుందని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు.

కార్గో సేవల విస్తరణ: ఆర్టీసీ జోన్–1 (ఉత్తరాంధ్ర) పరిధిలో కార్గో సేవలను విస్తృతం చేస్తోంది. గత ఏడాది రూ.14 లక్షల కార్గో ఆదాయం సమకూరింది.



పార్సిల్ బుకింగ్ కౌంటర్‌లో పికప్ సదుపాయంపై చర్చిస్తున్న డీసీటీఎం అప్పలనాయుడు

ఈ సంవత్సరం అది 17 శాతం పెరిగి రూ.17 లక్షలకు చేరింది. ఇటీవల ఆర్టీసీ అధికారులు నగరంలోని సిరిపురం, గురుద్వారా, ఎండాడ, ఆనందపురం, పెందుర్తి, మధురవాడలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో వెరసి పది బుకింగ్, డెలివరీ పాయింట్లను ఏర్పాటు చేశారు. త్వరలో పూర్ణామార్కెట్, అనకాపల్లి, పెందుర్తి, చింతూరు, రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా) సహా మరో పది పాయింట్లను అందుబాటులోకి తెస్తామని ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం బి.అప్పలనాయుడు 'సాక్షి'కి చెప్పారు. దశల వారీగా కార్గో/పార్సిల్/ బుకింగ్ డెలివరీ, పికప్ సేవలను మరింత విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నెలాఖరు నాటికి పికప్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు.

లోకేష్‌ను గణబాబు హైజాక్ చేశారు

టీడీపీ విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్



కల్యాణ మండపం వద్ద వేచి ఉన్న పాసర్ల ప్రసాద్

గోపాలపట్నం: నారా లోకేష్‌ను పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు హైజాక్ చేశారని టీడీపీ విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్ ఆరోపించారు. గోపాలపట్నం పెట్రోల్ బంక్ ప్రాంతంలో ఆదివారం నిర్వహించిన శంఖారావం సభ ప్రాంగణానికి వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో పిన్నమనేని కల్యాణ మండపం వద్దే ఆయన ఉండిపోయారు. లోకేష్‌కు ఎక్కడ నిజాలు తెలిసిపోతాయోనని.. గణబాబు మొత్తం షెడ్యూల్‌ను మార్చేశారన్నారు. బస్సులో నాయకులతో మాట్లాడం, బూత్ కన్వీనర్లకు దిశా నిర్దేశం లేకుండా వేదిక వద్దకు నేరుగా లోకేష్‌ను తీసుకువెళ్లారని ప్రసాద్ ఆరోపించారు. టీడీపీలో జీవిత కాల బహిష్కరణకు గురైన నాయకుడి విగ్రహాన్ని లోకేష్ ఆవిష్కరించేలా పన్నాగం పన్నారన్నారు.

శంఖారావం సభలకు స్పందన కరువు

జగదాంబ: తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదివారం నగరంలో నిర్వహించిన శంఖారావం సభలకు ప్రజల నుంచి స్పందన కరువైంది. విశాఖ తూర్పు, పశ్చిమ, దక్షిణ నియోజకవర్గాల్లో ఈ సభలు నిర్వహించేందుకు ముందస్తుగా ఏర్పాట్లు చేయగా.. ప్రజలు మాత్రం ముఖం చాటేశారు. జనాలు లేకపోవడంతో ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన సభ ఆలస్యంగా మొదలైంది. జనాలను తరలించడానికి తెలుగుదేశం నాయకులు నానా పాట్లు పడ్డారు. అయినప్పటికీ జనం వచ్చేందుకు ఆసక్తి చూపలేదు. వచ్చిన కొద్ది మంది లోకేష్ రొటీన్ ప్రసంగంతో విసుగు చెందారు. ఆయన మాట్లాడుతుండగానే.. సభ నుంచి మెల్లగా జారుకున్నారు. ఆయా సభల్లో లోకేష్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేశారు.

సీఎం జగన్ వల్లే నాగవంశీయులకు గుర్తింపు

నాగవంశం కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ అప్పలకొండమ్మ



మాట్లాడుతున్న నాగవంశం కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ

మధురవాడ: నాగ వంశీయులను గుర్తించి.. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాజ్యాధికారం ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందని నాగవంశం కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బొడ్డ అప్పల కొండమ్మ అన్నారు. పీఎం పాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడారు. విజయవాడలో టీడీపీ నాగవంశం సాధికారిక సమితి ప్రతినిధులు, ఆ పార్టీ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తమని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. 2009, 2014 ఎన్నికల మేనిఫెస్టోల్లో నాగవంశీయుల గ్రూపు మార్పు చేస్తానని చంద్రబాబు ప్రకటించి.. తర్వాత తొలగించి మోసం చేశారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగవంశానికి చెందిన మహిళను ప్రకటించి.. ఆర్థికంగా సరిపోరంటూ కొద్ది రోజులకే ఇతర సామాజిక వర్గానికి చెందిన వారికి సీటును అమ్ముకుని జాతిని అవమానించిన విషయం టీడీపీ నాయకులకు గుర్తులేదా అని ప్రశ్నించారు. మహా ధర్నా పేరుతో ఇంకా ఎంత కాలం మోసగిస్తారని మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం.. చంద్రబాబు మెప్పు కోసం తప్పుడు ఆరోపణలు చేయడం తగదని హితవు పలికారు. అన్ని జిల్లాల్లో నాగవంశీయులకు తగిన గౌరవం లభిస్తోందంటే.. అది కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లేనని చెప్పారు. ఈ విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో డైరెక్టర్‌లు జరజాపు నీలిమ, నల్లి ఆశాదీపిక, రాష్ట్ర నాగవంశం సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బొడ్డు అప్పలనాయుడు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ జరజాపు ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీలలితాపీఠం 75వ వార్షికోత్సవం



శ్రీలలితాపీఠంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్

సీతంపేట: శ్రీ లలితాపీఠం 75వ వార్షికోత్సవం సందర్భంగా 'అమృతోత్సవం'పేరిట ఈ నెల 19 నుంచి 24 వరకు పాంచరాత్ర దీక్షతో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. అక్కయ్యపాలెం శ్రీ లలితా పీఠంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19వ తేదీ సోమవారం ఉదయం 5 గంటల నుంచి మహా సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధన, అంకురార్పణ, రుత్విగ్వరణం, అగ్నిమథనం, అఖండ దీపస్థాపన, సాయంత్రం 7 గంటలకు లలితావైభవం కవి సమ్మేళనం, పీఠాధిపతిచే అనుగ్రహ భాషణం జరుగుతుందన్నారు. 20వ తేదీ ఉదయం 9 గంటలకు యాగశాలలో మండపారాధన, కలశస్థాపన, సాయంత్రం లలితాసహస్రనామ పారాయణ, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామి అనుగ్రహ భాషణం చేస్తారన్నారు. 21వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు శ్రీభూనీలా సమేత కల్యాణ వెంకటేశ్వరుని కల్యాణం, 22వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు లలితాకామేశ్వరుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుందని వెల్లడించారు. 23 తేదీ సాయంత్రం జగద్గురువులచే అమృత భాషణం, 24వ తేదీ ఉదయం విశేష హోమాలు, సాయంత్రం 6 గంటలకు లలితా అమ్మవారి నగరోత్సవం జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

మల్కాపురం: ఓ మానసిక రోగి.. విద్యుత్ స్తంభంపై ప్రమాదవశాత్తూ మరణించాడు. మరమ్మతుల కోసం విద్యుత్ శాఖకు చెందిన వ్యక్తి స్తంభం ఎక్కుతున్నాడని భావించిన స్థానికులు చూస్తుండగా.. విద్యుత్ షాక్‌తో ఆయన మృతి చెందడంతో ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలివీ.. జాలరవీధికి చెందిన మోదు నవీన్(23)కి కొంతకాలంగా మానసిక పరిస్థితి బాగోలేదు. అతనికి కుటుంబ సభ్యులు ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చికిత్స ఇప్పిస్తున్నారు. కాగా.. ఆదివారం ఉదయం తన ఇంటి నుంచి బయటకు వచ్చిన నవీన్.. మల్కాపురం మహాలక్ష్మి థియేటర్ ఎదురుగా ఐవోసీకి వెళ్లే మార్గంలోని 80 అడుగుల ఎత్తు గల విద్యుత్ హెవీ లైన్ స్తంభం ఎక్కాడు. ఆ సమయంలో అక్కడ బీటీ రోడ్డు పనులు చేపడుతున్న కార్మికులు, పాదచారులు నవీన్‌ను విద్యుత్ శాఖ సిబ్బంది అనుకుని తమ పనుల్లో నిమగ్నమయ్యారు. కొద్దిసేపటికి నవీన్ విద్యుత్ షాక్‌కు గురై విలవిలలాడటంతో గమనించి.. విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు విద్యుత్ సరఫరాను నిలిపివేసి.. పైన ఉన్న నవీన్‌ను కిందకు దించారు. అప్పటికే మృతి చెందిన అతని వివరాలు తెలియకపోవడంతో మల్కాపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు విచారణ చేపట్టి నవీన్‌గా గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

బర్డ్ ఫ్లూపై హై అలర్ట్!

- 'నెల్లూరు' ఘటనతో అప్రమత్తం
- ఇతర జిల్లాల నుంచి కోళ్ల రవాణా నిలిపివేత
- పౌల్ట్రీ రైతులకు పశు సంవర్ధక శాఖ అవగాహన
- పరిస్థితిని సమీక్షించేందుకు ప్రత్యేక వెటర్నరీ బృందాలు
- కోళ్ల ఫారాల్లోకి వాహనాలు, ఇతరుల ప్రవేశం నిషేధం



ఫారాల్లో పెరుగుతున్న కోళ్లు

సాక్షి, విశాఖపట్నం: బర్డ్ ఫ్లూ అలజడిపై పశుసంవర్ధక శాఖ అప్రమత్తమైంది. నెల్లూరు జిల్లాలో ఇటీవల పెద్ద సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడడం, అది బర్డ్ ఫ్లూ అని నిర్ధారణ కావడంతో ప్రభుత్వం యంత్రాంగాన్ని అలెర్ట్ చేసింది. ఈ వ్యాధి సోకిన కోళ్లు చనిపోవడమే కాదు.. వాటిని తిన్న మనుషులకు ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. దీంతో ఈ వ్యాధి ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని పశు సంవర్ధక శాఖను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. బర్డ్ ఫ్లూపై తీసుకోవలసిన జాగ్రత్తలపై పౌల్ట్రీ రైతులు, కోళ్ల ఫారాల నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్నారు. కోళ్ల ఫారాల్లోకి కొత్త వారిని అనుమతించవద్దని, ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బందినే కొనసాగించాలని, వీరిని ఇతర ప్రాంతాలకు పంపించవద్దని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను ఫారాల్లోకి ప్రవేశాన్ని నిషేధించాలని సూచిస్తున్నారు. ఒకవేళ వాహనాలను పంపించాల్సి వస్తే విధిగా సోడియం క్లోరైడ్‌ను చల్లాలని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి కోళ్ల రవాణాను కొన్నాళ్ల పాటు నిలిపివేయాలని పౌల్ట్రీ రైతులు, వర్తకులను ఆదేశించారు. అలాగే వలస పక్షుల వల్ల కూడా బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందే అవకాశం ఉండడంతో అలాంటి ప్రాంతాలపై దృష్టి సారిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో శానిటేషన్‌ను విస్తృతం చేస్తున్నారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం కొండకర్ల ఆవలో వలస పక్షుల రాకపోకలుంటాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని అక్కడ తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అనకాపల్లి జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి బి.ప్రసాదరావు ‘సాక్షి’తో చెప్పారు. ఆర్బీకేల పరిధిలో తమ సిబ్బంది బర్డ్ ఫ్లూపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. కాగా ఉమ్మడి విశాఖ జిల్లాలో బ్రాయిలర్, లేయర్ (గుడ్లు పెట్టేవి) కోళ్లు దాదాపు 37 లక్షల పెరుగుతున్నాయి. వీటిని సుమారు 130 ఫారాల్లో పెంచుతున్నారు. ఇవి కాకుండా మరో మూడు లక్షల దేశీ (నాటు) కోళ్లున్నాయి.

పశు సంవర్ధక శాఖ ప్రత్యేక టీమ్‌లు

బర్డ్ ఫ్లూపై పర్యవేక్షణకు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పశు సంవర్ధక శాఖ అధికారులు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. వీటిలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, ఆ శాఖ గ్రామ సహాయకులు ఉన్నారు. ఇలా విశాఖ జిల్లాలో 17, అనకాపల్లి జిల్లాలో 48 టీమ్‌లను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. వీరు గ్రామాల్లో తిరుగుతూ ఎక్కడైనా ఫారాల్లో కోళ్లు చనిపోతే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని కోరుతున్నారు.

బర్డ్ ఫ్లూపై ఆందోళన వద్దు

బర్డ్ ఫ్లూపై ఆందోళన చెందాల్సిన పని లేదని, ఇప్పటివరకు జిల్లాలో ఎక్కడా ఆ ఛాయలు లేవని నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (నెక్) విశాఖపట్నం జోనల్ ఛైర్మన్ టి.ఉదయ భాస్కర్ 'సాక్షి'కి చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు బర్డ్ ఫ్లూ సోకకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, కోళ్లకు ముందస్తుగా వ్యాక్సినేషన్లు వేయిస్తున్నామని, వైరస్ వ్యాప్తి చెందకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను ఫారాల్లోకి అనుమతించడం లేదని తెలిపారు. ఫారాల్లో కోళ్లకు నీటిలో బి-కాంప్లెక్స్, సిరప్‌లు ఇవ్వాలని, బర్డ్ ఫ్లూ సోకకుండా నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పౌల్ట్రీ రైతులకు సూచిస్తున్నామని విశాఖ జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రామకృష్ణ 'సాక్షి'కి చెప్పారు.

బైక్‌నే ప్రచారరథంగా మార్చి...

- జగనన్న కోసం ఓ ఉద్యోగి ప్రచారం



ప్రచార రథంపై అమరనాథ్ రెడ్డి

రాప్తాడు: తన జీవితం జగనన్నకే అంకితం అంటున్నాడు వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం కొత్తపేటకు చెందిన రామిరెడ్డి అమరనాథ్ రెడ్డి. ఈయనకు ముఖ్యమంత్రి అంటే పంచ ప్రాణాలు. విశాఖ శివారు దువ్వాడ ఫార్మాసిటీలోని లీ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌లో 11 ఏళ్లగా క్వాలిటీ విభాగంలో పనిచేస్తూ గాజువాకలో ఉంటున్నారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపించినందున రూ.40 వేల వేతనం వచ్చే ఉద్యోగాన్ని సైతం వదిలేసుకున్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేయాలంటూ ప్రతి గ్రామం, వీధిలో ప్రచారం చేస్తున్నారు. ఇందుకోసం తన ద్విచక్ర వాహనాన్నే ప్రచార రథంలా మార్చేశారు. వాహనానికి ఇరువైపులా 'బలవంతుడికి...బలహీనుడికి జరిగే యుద్ధం' అనే స్టిక్కర్ అతికించుకున్నారు. ద్విచక్ర వాహనంతో పాటు హెల్మెట్‌కు కూడా ప్రచార నిమిత్తం స్టిక్కరింగ్ చేయించుకున్నారు. అమరనాథ్‌రెడ్డి 2014, 2019 ఎన్నికల్లోనూ జగన్ కోసం ప్రచారం చేశారు. ప్రస్తుతం కూడా తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే ఆదివారం రాప్తాడులో జరిగిన 'సిద్ధం' సభకు వచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేసేందుకు వీలుగా తన భార్య మనోజ్ఞ, ఏడాది పాప నివేదితా రెడ్డిని గుంటూరులోని అత్తారింట్లో వదిలి పెట్టినట్లు అమరనాథ్ రెడ్డి తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకు తాను ప్రచారంలో పాల్గొంటానన్నారు.

నగరంలో నేడు

- ఉదయం 10 గంటలకు సీతమ్మధార వద్ద గ్యాస్ సిలిండర్ల పంపిణీ
- ఉదయం 9 గంటలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఎస్ఎఫ్ఎస్ స్కూల్ సందర్శన
- ఉదయం 11 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రగతి శీల మహిళ సంఘం అర్ధ శతాబ్ది వారోత్సవాలు
- సాయంత్రం 5 గంటలకు కలెక్టరేట్ వద్ద రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం, పోస్టర్ విడుదల.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.62,400
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.57,200
వెండి(కిలో):	రూ.78,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.135
స్కిన్	: రూ.240
స్కిన్‌లెస్	: రూ.250

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	555.00
విజయనగరం	559.00
శ్రీకాకుళం	559.00

శారదాపీఠంలో ఆధ్యాత్మిక సందడి

నేడు పూర్ణాహుతితో వేడుకలకు ముగింపు



రథోత్సవంలో పాల్గొన్న కోలాటం కళాకారులు



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలు

పెందుర్తి: శారదా పీఠం ప్రాంగణం.. వేదఘోషతో ప్రతిధ్వనించింది. సర్వప్రాణి శ్రేయస్సు కోసం తలపెట్టిన రాజశ్యామల, వనదుర్గ హోమాలతో ఆధ్యాత్మికత గుబాళించింది. నాలుగో రోజు ఆదివారం యజ్ఞయాగాదులు దిగ్విజయంగా జరిగాయి. సుబ్రహ్మణ్యస్వామి ఆరాధనతో పీఠం సందడిగా మారింది. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. పీఠం అనుష్ఠాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారికి, దాసాంజనేయ స్వామి, మేధాదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. గోమాతకు పూజ చేసి నైవేద్యం అందించారు. జమ్మి చెట్టు ప్రదక్షిణ చేశారు. సాయంత్రం సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం కనులపండువగా సాగింది. సుబ్రహ్మణ్యస్వామి, వల్లీ కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. నాలుగు రోజులుగా అత్యంత వైభవంగా సాగిన వార్షికోత్సవాలు సోమవారంతో ముగియనున్నాయి. లోక కల్యాణార్థం తలపెట్టిన రాజశ్యామల యాగం పూర్ణాహుతితో వేడుకలకు స్వామీజీలు ముగింపు పలుకుతారు. ఉత్సవాల ముగింపునకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రముఖులు హాజరు కానున్నారు.

సరుగుడు జలపాతం వద్ద సండే సందడి



జలపాతం వద్ద పర్యాటకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో కోలాహలం నెలకొంది. ఇక్కడ ఎత్త యిన రెండు కొండల మధ్యలోంచి ప్రవేశించే నీటిలో జలకాటాలాడేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు పోటీపడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వాహనాల్లో రావడంతో ఈ ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది. అదేవిధంగా తాండవ రిజర్వాయరుపైనా సందర్శకులు తాకిడి కనిపించింది. కొంతకాలంగా ఈ రెండు ప్రదేశాలను తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి అధికంగా సందర్శకులు రావడంతో కొత్తగా చిరువ్యాపారులు షాపులు ఏర్పాటు చేస్తున్నారు.

చాపరాయిలో...



తరలివచ్చిన పర్యాటకులు

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం వద్ద పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం మైదాన ప్రాంతం నుంచి కుటుంబ సమేతంగా భారీగా తరలి వచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు.

అమ్మకు పనిభారం.. బిడ్డకు అమ్మమ్మ మమకారం



గిరిజన ప్రాంతాల్లో మహిళలు వ్యవసాయ పనుల్లో నిత్యం నిమగ్నమై ఉంటారు. ప్రస్తుతం పసుపు తవ్వకాల సీజన్ కావడంతో ఎక్కడ చూసినా పనులు జోరందుకున్నాయి. ఇందులో భాగంగానే ఓ తల్లి తన బిడ్డను గొడుగు నీడన పడుకోబెట్టి పసుపు తవ్వుతుండగా, చిన్నారిని అమ్మమ్మ సాకుతూ కనిపించింది. మమకారానికి ప్రతీకగా నిలిచిన ఈ దృశ్యాన్ని చింతపల్లి మండలం చౌడుపల్లి గ్రామ పొలాల్లో 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి, పాడేరు

యూసీసీ టీ-20 విజేత గెలాక్సీ



గెలాక్సీ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి

విశాఖ స్పోర్ట్స్: యూసీసీ టీ-20లో గెలాక్సీ జట్టు విజేతగా, కావలీర్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. రైల్వే స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన డిఫెండింగ్ చాంపియన్ కావలీర్స్ జట్టు లక్ష్య ఛేదనకే మొగ్గుచూపడంతో గెలాక్సీ జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 168 పరుగులు చేసింది. సందీప్ 43, పి.అవినాష్ 33 పరుగులు చేశారు. విపిన్ మూడు వికెట్లు తీశాడు. ప్రతిగా కావలీర్స్ 18.5 ఓవర్లలో 114 పరుగులకే ఆలౌటైంది. పృథ్వీ 28 పరుగులు చేశాడు. అవినాష్ బౌలింగ్‌లోనూ రాణించి మూడు వికెట్లు తీయడంతో పాటు ఫైనల్ బెస్ట్‌గా నిలిచాడు. దీంతో 54 పరుగులతో విజయం సాధించిన గెలాక్సీ జట్టు తొలిసారి విజేతగా నిలిచింది. బెస్ట్ బ్యాటర్‌గా రవికుమార్, బెస్ట్ బౌలర్‌గా కమిల్, టోర్నీ బెస్ట్‌గా పాండురంగరాజు నిలిచారు. ఈ టోర్నీలో 12 జట్లు నాలుగు పూల్స్‌లో తలపడ్డాయి. పూల్ విజేతగా నిలిచిన జట్లు సెమీస్‌కు అర్హత సాధించాయి. సెమీస్‌లో ఈకోర్సా జట్టుపై గెలాక్సీ, మెట్రోసీసీపై కావలీర్స్ జట్లు విజయం సాధించి ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. పోటీల ముగింపు కార్యక్రమానికి ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి హాజరై విజేతలకు ట్రోఫీలందించారు. ఆర్.సి.హెచ్ ప్రసాద్, ఓబుల్‌రెడ్డి, ఎంసీసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీతారాములకు ఘనంగా పుష్పయాగం

1500 కిలోల వివిధ రకాలైన పూలను వినియోగించిన భక్తులు



పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

కె.కోటపాడు : ఆర్.వై.అగ్రహారం గ్రామంలో శ్రీ సీతారాములకు 1500 కిలోల వివిధ రకాలైన పుష్పాలతో పుష్పయాగం కనుల పండువలా జరిపారు. గ్రామానికి చెందిన గోవిందు రమణమూర్తి, నేమాని వేంకటేశ్వరశర్మలతో పాటు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం పుష్పయాగం నిర్వహించారు. పెందుర్తి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు మహర్షి రామానుజం ఆధ్వర్యంలో వేదపండితులు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేశారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి వేద పండితులు పుష్పయాగం ఘనంగా జరిపారు. కడియం నుంచి 1500 కిలోల బంతి, చామంతి, మల్లె, గులాబీలతో పాటు పలు రకాలైన పుష్పాలను తీసుకువచ్చి వినియోగించారు. కార్యక్రమంలో పాల్గొనడానికి ఆర్.వై.అగ్రహారంతో పాటు సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. సీతారాముల కల్యాణంతో ప్రారంభమైన కార్యక్రమం పుష్పయాగం, మహా మంగళ హారతితో ముగిసింది. అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠ అనంతరం రాష్ట్రంలో మొదటిసారిగా ఆర్.వై.అగ్రహారం గ్రామంలోనే సీతారాములకు పుష్పయాగం నిర్వహించినట్టు గోవిందు రమణమూర్తి, నేమాని వేంకటేశ్వరశర్మ తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరిపారు. రమణమూర్తి, మండ మల్లికార్జున్‌తో పాటు గ్రామస్తులు సహకారం అందించారు.